బీఆర్ఎస్ పాలనలో ప్రజలకు అన్యాయం


మానుకోటలో ప్రచారంలో మాట్లాడుతున్న మురళీనాయక్


శనిగపురంలో ప్రచారం నిర్వహిస్తున్న మురళీనాయక్

● ఎమ్మెల్యే అభ్యర్థి భూక్య మురళీనాయక్

మహబూబాబాద్ రూరల్: మహబూబాబాద్ నియోజకవర్గ ప్రజలు తనను ఆశీర్వదించి హస్తం గుర్తుకు ఓట్లు వేసి ఎమ్మెల్యేగా గెలిపిస్తే కాంగ్రెస్ పార్టీ గెలుపు అభివృద్ధికి మలుపుగా మారుతుందని ఎమ్మెల్యే అభ్యర్థి భూక్య మురళీనాయక్ అన్నారు. మహబూబాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని 09, 10, 23, 20, 22, 24, 25, 26, 36 వార్డుల్లో సీపీఐతో కలిసి మురళీనాయక్ ఆదివారం విస్తృత ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పదేళ్ల బీఆర్ఎస్ ప్రభుత్వ పాలనలో ప్రజలందరూ తీవ్ర అన్యాయానికి గురయ్యారన్నారు. బీఆర్ఎస్ పార్టీకి ప్రజలు రెండుసార్లు అవకాశం ఇస్తే అభివృద్ధిని మరచి అవినీతికి తెరతీశారని విమర్శించారు. రెండుసార్లు బీఆర్ఎస్ పార్టీకి అవకాశం ఇచ్చారని, ఒకసారి కాంగ్రెస్ పార్టీకి అవకాశం ఇచ్చి ప్రజలకు సేవచేసే అదృష్టాన్ని కల్పించాలని కోరారు. కాంగ్రెస్ పార్టీకి బలం పెరిగిందని, బీఆర్ఎస్, బీజేపీ ఒకటే అని పేర్కొన్నారు. రైతులు ఆరుగాలం కష్టపడి పండించిన పంటలకు సరైన ధర లేక పెట్టిన పెట్టుబడులు కూడా రాక ఆర్థికంగా నష్టపోతున్నారన్నారు. ప్రచారంలో డీసీసీ అధ్యక్షుడు జెన్నారెడ్డి భరత్ చందర్ రెడ్డి, సీపీఐ జిల్లా కార్యదర్శి బి.విజయసారథి, సీపీఐ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ బి.అజయ్ సారథి రెడ్డి, మున్సిపల్ మాజీ చైర్ పర్సన్ డాక్టర్ భూక్య ఉమా, మున్సిపల్ వార్డు కౌన్సిలర్లు భూక్య శ్రీను, బానోత్ హరిసింగ్, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ గుగులోత్ రాములునాయక్, నాయకులు పద్మం ప్రవీణ్, మాదరబోయిన యాకన్న, కొత్త ఇంద్రారెడ్డి, పెరుగు కుమార్, నర్ర శ్రావణ్, రేషపల్లి నవీన్, మంద శంకర్, మామిండ్ల సాంబలక్ష్మి, చింతకుంట్ల వెంకన్న, బానోత్ లింగ్యానాయక్, దూపటి వినయ్, సలువాది దిలీప్, నాయకలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మురళీనాయక్‌ను మెజార్టీతో గెలిపించాలి

కేసముద్రం: మురళీనాయక్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని మండల అధ్యక్షుడు అల్లం నాగేశ్వర్ రావు, మాజీ సర్పంచ్ డాక్టర్ అల్లం రమ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో ఎన్నికల ప్రచారంలో భాగంగా ఇంటింటికి తిరుగుతూ ఓట్లను అభ్యర్థించారు. అదే విధంగా అమీనాపురం శివారు సప్పిడిగుట్ట తండాలో కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు అంబటి మహేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రచారం చేశారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు రావుల మురళీ, పోలేపాక నాగరాజు, ఉప సర్పంచ్ ఆరెద్రపు శ్రీనివాస్, కల్లెం శ్రీనివాస్‌రెడ్డి, ఎండీ అయూబ్‌ఖాన్ పాల్గొన్నారు.

మురళీనాయక్ గెలుపే లక్ష్యం

నెల్లికుదురు: అభ్యర్థి మురళీనాయక్ గెలుపే లక్ష్యంగా ముందుకుసాగాలని మాజీ జెడ్పీటీసీ సభ్యుడు హెచ్.వెంకటేశ్వర్లు కాంగ్రెస్ నాయకులకు పిలుపునిచ్చారు. మండల కేంద్రంలో ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ టౌన్ ఉపాధ్యక్షుడిగా మండల కేంద్రానికి చెందిన ఆకుల కొమురెల్లిని ఆదివారం ఏకగ్రీవంగా నియమించినట్లు ఆయన తెలిపారు. 6 గ్యారంటీలు ప్రజల్లోకి తీసుకెళ్లి నెల్లికుదురు మండలంలో మురళీనాయక్‌కు 10వేల పైచిలుకు మెజార్టీ ఇస్తామన్నారు. కార్యక్రమంలో మండల వర్కింగ్ ప్రసిడెంట్ మానేందర్, నాయకులు పూర్ణచందర్, నరేష్, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌ను గెలిపిస్తే చీకటి రోజులే

● మంత్రి సత్యవతిరాథోడ్
ఎమ్మెల్యే అభ్యర్థి శంకర్‌నాయక్

గూడూరు: సాధించి తెచ్చుకున్న తెలంగాణలో కాంగ్రెస్ పార్టీని గెలిపిస్తే కరెంటు లేక చీకటి రోజులే వస్తాయని మంత్రి సత్యవతి రాథోడ్, ఎమ్మెల్యే అభ్యర్థి బానోతు శంకర్‌నాయక్ అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆదివారం మండలంలోని గుండెంగ, తేజావత్‌రాంసింగ్ తండా, బొల్లెపల్లి, నాయకపల్లి, తీగలవేణి గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా ముందుగా గుండెంగకు హాజరైన అభ్యర్థి శంకర్‌నాయక్‌కు ఎంపీటీసీ బోడ కిషన్‌నాయక్ మహిళల కోలాటాలతో, బతుకమ్మలతో ఘన స్వాగతం పలికారు. ఎడ్లుల బండిపై గ్రామంలో ప్రచారం నిర్వహించారు. అనంతరం తేజావత్‌రాంసింగ్‌తండాకు హాజరైన మంత్రి సత్యవతి రాథోడ్ మళ్లీ వచ్చేది కేసీఆర్ ప్రభుత్వమేనని, కాంగ్రెస్, బీజేపీలు చెప్పే మాటలు నమ్మొద్దన్నారు. కేసీఆర్ పథకాలు దేశానికే ఆదర్శంగా నిలిచాయన్నారు. గిరిజనులకు పోడు భూములకు పట్టాలు, ఇళ్లు ఇప్పించే బాధ్యత తనదని అభ్యర్థి శంకర్‌నాయక్ అన్నారు. కార్యక్రమంలో నాయకులు నరేష్‌రెడ్డి, భరత్‌కుమార్‌రెడ్డి, జెడ్పీ కోఆప్షన్ ఎండీ. ఖాసీం, వీరన్న, మండల అధ్యక్షుడు వెంకటక్రిష్ణారెడ్డి, ఎంపీటీసీ కిషన్‌నాయక్, రవి, సురేందర్, కఠార్‌సింగ్ పాల్గొన్నారు.


గూడూరు: తేజావత్‌రాంసింగ్‌తండాలో మాట్లాడుతున్న మంత్రి సత్యవతిరాథోడ్

బీఆర్ఎస్ గెలుపునకు కృషి చేయాలి

కేసముద్రం: బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి బానోత్ శంకర్‌నాయక్ గెలుపు కోసం పార్టీ శ్రేణులు కృషి చేయాలని మంత్రి సత్యవతిరాథోడ్ అన్నారు. ఆదివారం కేసముద్రం, ఇనుగుర్తి మండల కేంద్రాల్లో ఆమె పార్టీ శ్రేణులతో ప్రత్యేక సమావేశాలు నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ.. దేశంలోనే ఏ రాష్ట్రంలో లేని సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టిన ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కుతుందని తెలిపారు. ఎన్నికల్లో కార్యకర్తలు కష్టపడి పనిచేసి గెలిపిస్తే రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో సర్పంచ్‌లుగా ఎంపీటీసీలుగా అవకాశాలు దక్కుతాయని తెలిపారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నూకల నరేష్‌రెడ్డి, రాష్ట్ర నాయకుడు వద్దిరాజు కిషన్, మార్క్‌ఫెడ్ రాష్ట్ర డైరెక్టర్ రంగారావు, జెడ్పీటీసీ రావుల శ్రీనాథ్‌రెడ్డి, సర్పంచ్‌ల ఫోరం జిల్లా అధ్యక్షుడు మాధారపు సత్యనారాయణరావు, మండల అధ్యక్షుడు ఎండీ నజీర్ అహ్మద్, నెహ్రూరెడ్డి పాల్గొన్నారు.


గూడూరు: గుండెంగలో ప్రజలకు అభివాదం చేస్తున్న శంకర్‌నాయక్

సీతక్కను భారీ మెజారిటీతో గెలిపించండి

● తీన్మార్ మల్లన్న

ములుగు: ఎమ్మెల్యేగా కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి సీతక్కను భారీ మెజారిటీతో గెలిపించాలని తీన్మార్ మల్లన్న అన్నారు. ఆదివారం సీతక్కతో కలిసి ములుగు మండలంలోని జంగాలపల్లి, ఇంచర్ల గ్రామాల్లో నిర్వహించిన కార్నర్ మీటింగ్‌లో మల్లన్న మాట్లాడారు. రాష్ట్రాన్ని అధోగతి పాలు చేసిన సీఎం కేసీఆర్ ప్రభుత్వం తరఫున చేస్తున్న ప్రచారాలను చూసి మోస పోవద్దని సూచించారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు పైడాకుల అశోక్, కిసాన్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు గొల్లపల్లి రాజేందర్ గౌడ్ తదితరులు ఉన్నారు.

ధరణి పోర్టల్ రద్దు చేస్తాం..

ములుగు రూరల్: కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన వెంటనే రైతులు గోసపడుతున్న ధరణి పోర్టల్‌ను రద్దు చేస్తామని ఆ పార్టీ అభ్యర్థి, ఎమ్మెల్యే ధనసరి సీతక్క అన్నారు. ఆదివారం మండలంలోని మల్లంపల్లి, అబ్బాపూర్, శ్రీరాములపల్లి, కుమ్మరి పల్లి, బానాలపల్లి, మహ్మద్ గౌస్ పల్లి, గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. గ్రామాల్లో ఎన్నికల ప్రచారానికి వచ్చిన సీతక్కకు ప్రజలు బ్రహ్మరథం పట్టి స్వాగతం పలికారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. పోడు సాగు చేసుకుంటున్న గిరిజనులు, గిరిజనేతరులు అనే బేధం లేకుండా అందరికీ పోడు పట్టాలను అందిస్తామని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లో ఆరు గ్యారంటీలను అమలు చేస్తామని అన్నారు. కాంగ్రెస్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలన్నారు. ఈ కార్యక్రమంలో కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు గొల్లపల్లి రాజేందర్ గౌడ్, బానోజు రవిచందర్, పల్లే జయపాల్ రెడ్డి, బాదం ప్రవీణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.


ములుగు: ప్రచారంలో మాట్లాడుతున్న తీన్మార్ మల్లన్న, పక్కన సీతక్క

బలవంతపు రాజకీయాలు సిగ్గుచేటు

మంగపేట: అధికార బీఆర్ఎస్ పార్టీ ఓటమి బయంతో బలవంతపు రాజకీయాలకు పాల్పడం సిగ్గుచేటని కాంగ్రెస్ పార్టీ ములుగు ఎమ్మెల్యే అభ్యర్థి సీతక్క కోడలు కుసుమాంజలి సూర్య అన్నారు. మండలంలోని పూరేడుపల్లిలో సీతక్క గెలుపు కోసం ఆమె ఆదివారం ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గ్రామంలోని కాంగ్రెస్ పార్టీ అభిమానులను అధికార బీఆర్ఎస్ పార్టీకి చెందిన కొందరు నాయకులు బెదిరింపులకు చేసి పార్టీలో చేర్పించుకున్నారన్నారు. తిరిగి వారు కాంగ్రెస్ పార్టీకి రావడం చాలా సంతోషం అన్నారు. పార్టీ కార్యకర్తలను, అభిమానులను, నాయకులను కంటికి రెప్పలా కాపాడుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల మహిళా అధ్యక్షురాలు శానం నిర్మల, గ్రామ కమిటీ నాయకులు వాసంపల్లి రజిత, నాయకులు పాల్గొన్నారు.

ప్రచారానికి నిరసన సెగ

గూడూరు: మండలంలోని గుండెంగలో ఆదివారం చేపట్టిన బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి బానోతు శంకర్‌నాయక్ ప్రచారానికి సర్పంచ్ రవిసింగ్‌రాథోడ్, కాంగ్రెస్ కార్యకర్తలు నిరసన తెలిపారు. గడచిన 5 సంవత్సరాలలో ఎమ్మెల్యేగా శంకర్‌నాయక్ గ్రామ పంచాయతీకి ఒక్క పైసా రాకుండా చేశారన్నారు. పథకాలను బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలకు తప్ప, పేదలకు ఇవ్వలేదన్నారు. ఆందోళనను పసిగట్టిన పోలీసులు కేంద్ర బలగాలతో వచ్చి నిరసనకారులను పక్కకు నెట్టారు.

జాతరకు ప్రత్యేక బస్సులు

నెహ్రూసెంటర్: కార్తీక పౌర్ణమి సందర్భంగా కందికొండ జాతరకు ఆర్టీసీ డిపో మహబూబాబాద్ ఆధ్వర్యంలో ప్రత్యేక బస్సులను నడపనున్నట్లు ఆర్టీసీ డిపో మేనేజర్ ఎం.శివప్రసాద్ ఆదివారం తెలిపారు. ఈ సందర్భంగా డీఎం మాట్లాడుతూ.. రెగ్యులర్‌గా నడుస్తున్న 14 బస్సు సర్వీసులతోపాటు భక్తుల సౌకర్యార్థం 5 ప్రత్యేక ఆర్టీసీ బస్సులను నడిపిస్తామని అన్నారు. ప్రయాణికులు, భక్తులు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకుంటున్నామని, పెద్దలకు రూ.30, పిల్లలకు రూ.20 చార్జీలు వసూలు చేయనున్నారు.

ఎనీటైం అందుబాటులో ఉంటా


మరిపెడ రూరల్: బాల్యతండాలో ప్రచారంలో మాట్లాడుతున్న రెడ్యానాయక్


కురవి: సూదనపల్లిలో ఎన్నికల ప్రచారం చేస్తున్న కార్యకర్తలు

● ఎమ్మెల్యే అభ్యర్థి డీఎస్ రెడ్యానాయక్

మరిపెడ రూరల్/మరిపెడ: చివరిసారి సేవ చేసే భాగ్యం కల్పించాలని డోర్నకల్ ఎమ్మెల్యే అభ్యర్థి డీఎస్ రెడ్యానాయక్ అన్నారు. ఎన్నికల్లో భాగంగా ఆదివారం మరిపెడ మండలం దంటకుంటతండా, బాల్యతండా, వీరారం గ్రామాల్లో ప్రజాఆశీర్వాద కార్యక్రమం చేపట్టారు. ఆయా గ్రామాల్లో ఏర్పాటు చేసిన సమావేశాల్లో ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కేసీఆర్ పాలనలో అన్నివర్గాల ప్రజలకు మేలు జరిగిందన్నారు. కాంగ్రెస్ పాలనలో అన్నివర్గాల ప్రజలు ఇబ్బందులు పడ్డారన్నారు. కనీసం తాగు, సాగునీరు ఇవ్వలేని దుస్థితి కాంగ్రెస్ పాలనలో చోటు చేసుకుందన్నారు. ఎక్కడో సూర్యాపేట నుంచి వలస వచ్చిన రాంచంద్రునాయక్‌కు ఇక్కడ టికెట్ ఇవ్వడం ఏంటని ఎమ్మెల్యే ప్రశ్నించారు. నాది పక్కా లోకల్ ఎనీ టైం అందుబాటులో ఉంటు ప్రజా సమస్యలు పరిష్కరిస్తానన్నారు. చివరి అవకాశం ఇచ్చి సేవచేసే భాగ్యం కల్పించాలని కోరారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు సత్యనారాయణరెడ్డి, పీఏసీఎస్ డైరెక్టర్ చాపల యాదగిరిరెడ్డి, జిల్లా రైతు సమన్వయ సభ్యులు జర్పుల కాలునాయక్, మాజీ సర్పంచ్ పానుగోతు రాంలాల్, సర్పంచుల ఫోరం మండల అధ్యక్షుడు శ్రీనివాస్, మాజీ జెడ్పీటీసీ మాణిక్యం, సర్పంచులు అజీర పద్మహరినాయక్, భరత్‌కుమార్, స్వాతి, ఎంపీటీసీ అజ్మీర జిక్కినారాయణ, మున్సిపల్ వైస్ చైర్మన్ ముదిరెడ్డి బుచ్చిరెడ్డి, కౌన్సిలర్‌లు సుజాతవెంకన్న, లలితవెంకటేశ్వర్లు, ప్రగతిశ్రీపాల్ రెడ్డి, స్రవంతిభద్రయ్య, రేఖ దర్గయ్య పాల్గొన్నారు.

దంతాలపల్లి: మండలంలో రెడ్యానాయక్ గెలుపు కోసం మండలంలోని వివిధ గ్రామాలలో బీఆర్ఎస్ పార్టీ శ్రేణులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ నూకల వెంకటేశ్వరరెడ్డి, జిల్లా నాయకులు కొమ్మినేని రవీందర్, రైతు మండల సమితి కోఆర్డినేటర్ మల్లారెడ్డి, సోషల్ మీడియా మండల అధ్యక్షుడు చిల్లా రామకృష్ణ, ఎంపిటీసీలు పాల్గొన్నారు.

రెడ్యానాయక్‌ను గెలిపించాలి

కురవి: మండలంలోని వివిధ గ్రామాల్లో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ఎన్నికల ప్రచారం ఆదివారం జోరుగా సాగింది. సూదనపల్లి గ్రామంలో కన్నెగంటి వెంకటరమణ నేతృత్వంలో ఇంటింటికి తిరిగి డీఎస్ రెడ్యానాయక్‌ను గెలిపించాలని కోరుతూ ప్రచారం చేశారు.

సంక్షిప్త సమాచారం

కాంగ్రెస్‌లో చేరికలు

మరిపెడ రూరల్: బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు నూలక శ్రీరంగారెడ్డితో పాటు ఉమ్మడి ఎడ్జెర్ల గ్రామ రెవెన్యూ పరిధిలోని సుమారు 1000 మంది బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు, నాయకులు మాజీ ఎంపీ రామసహాయం సురేందర్‌రెడ్డి , కాంగ్రెస్ డోర్నకల్ అభ్యర్థి డాక్టర్ జాటోతు రాంచంద్రునాయక్ ఆధ్వర్యంలో ఆదివారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. పార్టీలో చేరిన వారిలో మాజీ కోఆప్షన్ సభ్యుడు అఫ్జల్, ఎడ్జెర్ల సర్పంచ్ అనూషవెంకన్న, ఎంపీటీసీ బానోతు రామన్న, మాజీ ప్రజా ప్రతినిధులు ఉన్నారు.

గూడూరు: మండల కేంద్రానికి చెందిన మాజీ ఎంపీటీసీ ఐలబోయిన సమ్మక్కతోపాటు మరికొంత మంది పీఏసీఎస్ చైర్మన్ చల్ల లింగారెడ్డి, మండల అధ్యక్షుడు చిట్టె వెంకన్న ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు.

బీఆర్ఎస్‌లో చేరిక

నర్సింహులపేట: మండలంలోని పడమటిగూడెం గ్రామానికి చెందిన పలువురు కాంగ్రెస్ యువకులు ఆదివారం బీఆర్ఎస్ జిల్లా నాయకుడు కాలసాని దామోదర్‌రెడ్డి సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. కార్యక్రమంలో మైదం దేవేందర్, వైస్ ఎంపీపీ దేవేందర్, ఎంపీటీసీ మదురెడ్డి, వెంకన్న పాల్గొన్నారు.

గార్ల: గార్లలో వివిధ పార్టీలకు చెందిన 20కుటుంబాలు సోమవారం బీఆర్ఎస్‌లో చేరారు. ఈసందర్భంగా పార్టీలో చేరిన వారికి బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు గంగావత్ లక్ష్మణ్‌నాయక్ పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ శీలంశెట్టి రమేష్, ఎం భాస్కర్‌రావు, కోట ఉత్తరయ్య, నానిగౌడ్, కత్తి కోటేష్, గాజుల గణేష్, తదితరులు పాల్గొన్నారు.

పోలీసుల కవాతు

గంగారం: సార్వత్రిక ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును ప్రశాంత వాతావరణంలో సద్వినియోగం చేసుకోవాలని గంగారం ఎస్సై దిలీప్ అన్నారు. మండల కేంద్రంతోపాటు, సమస్యాత్మ గ్రామాల్లో ఎస్సై ఆధ్వర్యంలో పోలీస్ బలగాలతో కవాతు నిర్వహించారు.

దొరల పాలనకు చరమగీతం పాడాలి

డోర్నకల్: రాష్ట్రంలో బీఆర్ఎస్ దొరల పాలనకు చరమగీతం పాడాలని ఆల్ ఇండియా ట్రైబల్ జేఏసీ చైర్మన్ రవీంద్రనాయక్ అన్నారు. డోర్నకల్‌లో ఆదివారం కాంగ్రెస్ నాయకులతో నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో రవీంద్రనాయక్ మాట్లాడారు. సమావేశంలో నాయకులు సుమేర్‌చంద్ జైన్, మాదా శ్రీనివాస్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

డోర్నకల్: గుండ్రాతిమడుగు, డోర్నకల్ రైల్వేస్టేషన్ల మధ్య గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని ఆదివారం డోర్నకల్ జీఆర్పీ పోలీసులు గుర్తించారు. డోర్నకల్ జీఆర్పీ ఎస్సై శ్రీకాంత్ తెలిపిన వివరాల ప్రకారం.. గుండ్రాతిమడుగు డోర్నకల్ రైల్వేస్టేషన్‌ల మధ్య కిలోమీటర్ నెం.448/36 వద్ద గుర్తు తెలియని పురుషుడి మృతదేహాన్ని గుర్తించినట్లు తెలిపారు. మృతుడు సుమారు 25 నుంచి 30 సంవత్సరాల వయసు కలిగి ఉంటాడని మృతుడి వద్ద ఎలాంటి ఆధారాలు లభించలేదని మృతుడి సమాచారం తెలిసిన వారు 87126 58600 నంబర్‌కు సమాచారం అందించిలని కోరారు.

దుగ్గి కృష్ణను గెలిపించండి

గార్ల: ఇల్లెందు సీపీఎం ఎమ్మెల్యే అభ్యర్థి దుగ్గి కృష్ణను గెలిపించాలని కోరుతూ మండలంలోని బుద్దారం, సీతంపేట పంచాయతీలో సీపీఎం మండల కార్యదర్శి కందునూరి శ్రీనివాసరావు ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు రాజారావు, లోకేశ్వరరావు, వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా పవిత్రోత్సవాలు



మహబూబాబాద్ రూరల్: శ్రీరుక్మిణి సత్యభామా సమేత శ్రీవేణుగోపాలస్వామి వారి పవిత్రోత్సవాలు వైభవంగా జరిగాయి. శ్రీ వేణుగోపాలస్వామి దేవాలయ ప్రధాన అర్చకులు ముడుంబై లక్ష్మీనారాయణచార్యులు ఆధ్వర్యంలో యాజ్ఞికులు పూజల్లో భాగంగా శ్రీవిష్వక్సేనారాధన, పుణ్యాహవచనం, అంకురార్పణ పూజలు నిర్వహించారు.

రాజ్యాంగ ఆమోద దినోత్సవం



మహబూబాబాద్ అర్బన్: ఎస్సీ ఎస్టీ ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో భారత రాజ్యాంగ ఆమోద దినోత్సవం వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఉపాధ్యాయులు అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సంఘం నాయకడు పార్నంది రామయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి భద్ర నాయక్, నాయకులు వీరస్వామి, నాగార్జున, రమేష్, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

బీజేపీ ప్రచారం

బయ్యారం: ఇల్లెందు నియోజకవర్గం నుంచి బీజేపీ అభ్యర్థిగా పోటీచేస్తున్న రవీందర్‌నాయక్ ఆదివారం బయ్యారంలో రోడ్‌షో నిర్వహించాడు. మండల అధ్యక్షుడు వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

నర్సింహులపేట: మండలంలోని జయపురం, కొమ్ములవంచ శివారు తండాల్లో ఆదివారం బీజేపీ నాయకులు యాకన్న, సందీప్, రవినాయక్ ఆధ్వర్యంలో బీజేపీ అభ్యర్థి భూక్య సంగీత గెలుపు కోసం ఇంటింటా ప్రచారం చేశారు.

రైలు ప్రయాణికులపై నిఘా

డోర్నకల్: డోర్నకల్ రైల్వేస్టేషన్ మీదుగా ప్రయాణం చేస్తున్న ప్రయాణికుల కదలికలపై పోలీసులు నిఘాపెట్టారు. రైళ్ల ద్వారా డబ్బును సులువుగా తరలించే అవకాశాలు ఉండడంతో సివిల్, రైల్వే పోలీసులతోపాటు ఎన్నికల సిబ్బంది రైల్వేస్టేషన్‌పై ప్రత్యేక దృష్టి సారించారు. తెల్లవారుజాము నుంచి రాత్రి వరకు డోర్నకల్ రైల్వే స్టేషన్‌లో రైళ్లు నిలిచిన సమయంలో ప్రయాణికులను తనిఖీ చేస్తున్నారు.

సత్యనారాయణ స్వామి వ్రతపూజలు

దంతాలపల్లి: మండలం బీరిశెట్టిగూడెం గ్రామ లక్ష్మి గార్డెన్‌లో ఆర్యవైశ సంఘం ఆధ్వర్యంలో కార్తీక మాసం సందర్భంగా ఆదివారం సామూహిక సత్యనారాయణ స్వామి వ్రత పూజలు నిర్వహించారు.

బీసీ అభ్యర్థిని ముఖ్యమంత్రి చేస్తాం



గార్ల: రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి వస్తే బీసీ కులానికి చెందిన అభ్యర్థిని ముఖ్యమంత్రి చేస్తామని బీజేపీ మైనారిటీ మోర్చా రాష్ట్ర కార్యదర్శి ఆర్ విమల్‌కుమార్‌జైన్ అన్నారు. గార్లలో నిర్వహించిన ఇల్లందు నియోజకవర్గ బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి ధరావత్ రవీందర్‌నాయక్ ప్రచార సభలో ఆయన పాల్గొని ప్రసంగించారు. రాష్ట్రంలో కేసీఆర్ నియంత, దొరల పాలనకు స్వస్తి పలకాలంటే రాష్ట్రంలో బీజేపీ పార్టీని గెలిపించుకోవాలని సూచించారు. రవీందర్‌నాయక్ కమలం గుర్తుకు ఓటేసి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. ప్రచార సభలో పార్టీ మండల అధ్యక్షుడు జశ్వంత్ ఠాకూర్, నాగరాజు, బుచ్చిబాబు, దేవా, చిరంజీవి, వీర్యానాయక్, రాజేష్, తదితరులు పాల్గొన్నారు.

ప్రతి పక్షాలను నిలదీయాలి

కొత్తగూడ: పక్క రాష్ట్రంలో ఇవ్వలేని హామీలు తెలంగాణలో ఎలా ఇస్తారని ప్రచారానికి వచ్చే కాంగ్రెస్ పార్టీ నాయకులను నిలదీయాలని రెడ్కో చైర్మన్ సతీష్‌రెడ్డి సూచించారు. మండలకేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఓటమి భయంతోనే ఇతర రాష్ట్రాల నాయకులను పిలుచుకుని ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు. బడే నాగజ్యోతి గెలిచిన ఆరునెలల్లో పాకాల రిజర్వాయర్ నుంచి ఎత్తిపోతల పథకం ద్వారా రెండు పంటలకు నీళ్లు, గిరిజనేతరులకు పట్టాలు రైతుబంధు ఇప్పిస్తామని హామీ ఇచ్చారన్నారు. సమావేశంలో ఓడీసీఎంఎస్ వైస్ చైర్మన్ దేశిడి శ్రీనివాస్‌రెడ్డి, వేణు, నెహ్రూ, సూర్య, సమ్మయ్య, బాలాజీలు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ నాయకుల దాడి

కురవి: యువకుడు మామిడాల వీరన్నపై బీఆర్ఎస్ నాయకులు దాడికి పాల్పడి తీవ్రంగా గాయపర్చిన సంఘటన ఆదివారం రాత్రి కురవి మండల కేంద్రంలో చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి.. కురవిలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో రాత్రి భారీ ర్యాలీ చేశారు. ర్యాలీ బీఆర్ఎస్ నాయకుడి రైస్ మిల్లు వద్దకు చేరుకుంది. ర్యాలీ అనంతరం మిల్లు వద్ద వచ్చిన జనానికి ఖర్చుల కింద కొంత నగదు ఇచ్చారు. ఈ క్రమంలో మామిడాల వీరన్న అనే యువకుడిపై బీఆర్ఎస్‌కు చెందిన కొందరు వ్యక్తులు దాడికి పాల్పడ్డారు. తీవ్రగాయాలైన వీరన్నను స్థానిక ఆస్పత్రికి తరలించారు.

కుమ్మరులకు అండగా బీఆర్ఎస్

ఏటూరునాగారం: బీఆర్ఎస్ పార్టీ కుమ్మరులకు అండగా ఉంటుందని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు కాకులమర్రి లక్ష్మీనర్సింహారావు అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని 3వ వార్డులో కుమ్మరి సంఘం నాయకులతో ఆయన సమావేశమై మాట్లాడారు. అన్ని వర్గాల ప్రజలు బీఆర్ఎస్ పార్టీకి మద్దతు ఇస్తున్నారని, కుమ్మరి సంఘంలోని ప్రజలు, నాయకులు మద్దతు ఇచ్చి బడే నాగజ్యోతిని గెలిపించాలని కోరారు. అనంతరం కుమ్మరి సంఘం జిల్లా అధ్యక్షులు ఆశాడపు దేవేందర్ ప్రజాపతి మాట్లాడుతూ.. మానవ సమాజానికి నాగరికత నేర్పింది మొదటిగా కుమ్మరులేనని గుర్తుచేస్తూ ఎన్ని ప్రభుత్వాలు మారినా కుమ్మరుల స్థితిగతులు మారలేదు అన్నారు. ఏటూరునాగారంలో కుమ్మరులకు ఉన్న స్థలానికి ప్రహరీ నిర్మాణం, ఒక కమ్యూనిటీ హాల్ మంజూరు చేయాలని, అర్హులైన కుమ్మరులకు గృహలక్ష్మి ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో మల్లారెడ్డి, వలిబాబా, ప్రమోద్, అశ్విని, తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న లక్ష్మీనర్సింహారావు

మారుతున్న రాజకీయ సమీకరణాలు

డోర్నకల్: కొద్ది రోజులుగా ప్రజాప్రతినిధులు, రాజకీయ నాయకులు, కార్యకర్తలు పార్టీలు మారుతుండడంతో రాజకీయ సమీకరణాలు మారుతున్నాయి. ఈనేపథ్యంలో తమ పరిధిలోని పోలింగ్ బూతుల్లో మెజారిటీపై దృష్టి సారిస్తున్నారు. ఇప్పటి వరకు నియోజకవర్గ, మండల, గ్రామస్థాయి నాయకులు తమ నేతలను గెలిపించుకునేందుకు ఇతర గ్రామాలు, మండలాల్లో ప్రచారం పేరుతో హడావుడి చేశారు. ప్రస్తుతం జంప్ జిలానీలతో సమీకరణాలు మారుతుండడంతో నాయకులు, ప్రజాప్రతినిధులు తమ సొంత బూత్‌లో మెజారిటీపై దృష్టి సారించాల్సిన పరిస్థితి నెలకొంది. పోలింగ్ బూత్‌ల పరిధిలో నాయకులు, ఓటర్లు పార్టీలు మారడం, తటస్థ ఓటర్ల వైఖరి అంచనా వేయలేకపోవడంతో బూత్‌ల పరిధిలోని నాయకులు తమ బూత్ మెజారిటీపై ఆందోళన చెందుతున్నారు. దీంతో తమ నేత గెలుపోటములను ప్రక్కన పెట్టి బూత్ మెజారిటీపై దృష్టి సారించి బూత్ పరిధిలో ప్రచార వేగం పెంచారు.

భూ వ్యసనపరుడు శంకర్‌నాయక్

హబూబాబాద్ రూరల్: బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి బానోత్ శంకర్ నాయక్ భూ వ్యసనపరుడని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు జెన్నారెడ్డి భరత్ చందర్ రెడ్డి, జిల్లా కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధులు దేవరం ప్రకాష్ రెడ్డి, కాట భాస్కర్, కాంగ్రెస్ జిల్లా నాయకులు ఎడ్ల రమేష్ అన్నారు. జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ భూక్య మురళీనాయక్ క్యాంప్ కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. శంకర్ నాయక్‌పై భూకబ్జా ఆరోపణలు చేస్తూ సంబంధిత పత్రాలను విడుదల చేశారు. కార్యక్రమంలో లంబాడా హక్కుల పోరాట సమితి నాయకుడు బోడ రమేష్, మున్సిపల్ వార్డు కౌన్సిలర్ భూక్యా శ్రీనివాస్, మండల అధ్యక్షుడు మిట్టకంటి రాంరెడ్డి, ఎండి.ఖలీల్, నూనావత్ రాములు, నిమ్మల శ్రీనివాస్, నీరుటి సురేష్, తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న భరత్ చందర్ రెడ్డి

దొంగ అరెస్ట్

డోర్నకల్: కొద్ది రోజుల క్రితం సుభాష్‌వీధిలోని ఓ ఇంట్లో చోరీకి పాల్పడిన దొంగను అరెస్ట్ చేసినట్లు డోర్నకల్ సీఐ బి.ఉపేందర్‌రావు తెలిపారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. గత సెప్టెంబర్ 20న సుభాష్‌వీధికి చెందిన వార్డు కౌన్సిలర్ శీలం శ్రీనివాస్ దంపతులు ఇంటికి తాళం వేసి గుంటూరుకు వెళ్లగా గుర్తు తెలియని వ్యక్తులు ఇంటి తాళం పగలగొట్టి 7.2 తులాల బంగారు ఆభరణాలు, రూ.20వేల నగదు చోరీ చేసినట్లు తెలిపారు. భాగ్యలక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతుండగా ఆదివారం స్థానిక చెక్‌పోస్ట్ వద్ద వాహన తనిఖీలో ఓ వ్యక్తి పట్టుబడినట్లు తెలిపారు. తమ విచారణలో భాగ్యలక్ష్మి ఇంట్లో చోరీకి పాల్పడిన వ్యక్తిగా గుర్తించినట్లు తెలిపారు. ఖమ్మంకు చెందిన మతిన్ అలియాస్ మున్నా పలు సెప్టెంబర్ 20వ తేదీ రాత్రి ఖమ్మం నుంచి రైలులో డోర్నకల్‌కు వచ్చి తాళం వేసి ఉన్న భాగ్యలక్ష్మి ఇంటిలో చోరీకి పాల్పడినట్లు విచారణలో తేలిందన్నారు. మతిన్ గతంలో గార్ల, మరిపెడ, కేసముద్రంలోని పలు ఇళ్లలో చోరీకి పాల్పడినట్లు గుర్తించామన్నారు. నిందితుడి నుంచి 7.2 తులాల బంగారు ఆభరణాలను స్వాధీనపర్చుకుని రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు.


మాట్లాడుతున్న సీఐ ఉపేందర్‌రావు

సాక్షి
పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
ఎస్.కె. అన్వర్ పాషా, (S.R) : 7997958185
ఐ. సతీష్ (S.R) (డోర్నకల్) : 9640394736
ఎం. మురళి, (S.R) (తొర్రూరు) : 7680822646